గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు : పీవో

ఉట్నూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు.



ట్రిపుల్ ఐటీలో ఉద్రిక్తత

- కళాశాలలో మరో విద్యార్థిని ఆత్మహత్య
- క్యాంపస్ ముట్టడికి ఏబీవీపీ ప్రయత్నం
- సీఐ అత్యుత్సాహం
- కర్రలతో సెక్యూరిటీ సిబ్బంది దాడి
- ఏబీవీపీ కార్యకర్తలకు తీవ్రగాయాలు

7

అదిగో పెద్దపులి!

- ఆదిలాబాద్ అడవుల్లో సంచారం
- భయాందోళనలో మారుమూల గ్రామాలు



మహబూబ్‌ఘాట్‌లో పెద్దపులి

నేరడిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ సరిహద్దు ప్రాంతమైన నిర్మల్ జిల్లా మహబూబ్‌ఘాట్‌లో పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఆదివారంరాత్రి నిర్మల్-ఆదిలాబాద్ రోడ్డుపై పులి ప్రత్యక్షమైంది. అటవీ ప్రాంతంలోని ఘాట్‌రోడ్డు దాటుతుండగా ప్రయాణికులు పులిని చూసి ఒక్కసారిగా షాకయ్యారు. ఓ వాహనదారుడు దాన్ని వీడియోతీశారు. పెద్దపుల్లి సంచారంతో నేరడిగొండ, నర్సాపూర్, సారంగాపూర్, మండలాల ప్రజలు వణికిపోతున్నారు. అటువైపు ద్విచక్రవాహనాలపై ప్రయాణించే ప్రయాణికులను వెళ్లకుండా అటవీశాఖ అధికారులు నిలువరించారు. మండలానికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో పులి సంచరించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు అంటున్నారు. పులిని చూసిన ప్రజలు భయపడుతున్నారు.

జీసీసీ సూపర్ మార్కెట్లు మూతబడుతున్నాయ్!

- జిల్లాలో ఆదరణ కోల్పోతున్న జీసీసీ సూపర్ మార్కెట్లు
- అందుబాటులో లేని అటవీ ఉత్పత్తులు
- ఆదివాసీ గిరిజనులకు కరువవుతున్న ఉపాధి
- తేలికగా తీసుకుంటున్న ఐటీడీఏ అధికారులు



ఆదిలాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటవీ ఉత్పత్తులను సేకరించి మార్కెట్లో విక్రయించేందుకు ఏర్పాటు చేసిన గిరిజన సూపర్ మార్కెట్లకు ప్రజల్లో ఆదరణ కరువై మూతబడుతున్నాయి. ఎక్కడచూసినా 'నో స్టాక్' బోర్డులే కనిపిస్తున్నాయి. ప్రారంభంలో కొంత హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత అసలు విషయాన్నే పూర్తిగా మరిచిపోతున్నారు. సహజ సిద్ధమైన అటవీ ఉత్పత్తులపై ప్రజల్లో మంచి ఆదరణ కనిపిస్తున్న అధికారుల నిండు నిర్లక్ష్యంతో ఆదివాసీ గిరిజనులకు ఉపాధి అవకాశాలు దూరమవుతున్నాయి. అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆదివాసీలు దళారుల బారిన పడకుండా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ)ను ఏర్పాటుచేశారు. దీని ద్వారానే అటవీ ఉత్పత్తులను సేకరించి నిత్యావసరాల దుకాణాలు, సూపర్‌మార్కెట్లు, రైతు బజార్‌లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉట్నూర్ మండలకేంద్రంతోపాటు ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రైతుబజార్‌లలో సూపర్‌మార్కెట్‌లను ఏర్పాటుచేసిన అవసరమైన స్టాక్ అందుబాటులో లేకపోవడంతో విక్రయాలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా జీసీసీ సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేసి అవసరమైన ఉత్పత్తులను అందుబాటులో ఉంచక పోవడంతో వినియోగదారుల ఆదరణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.

చేతులెత్తేస్తున్న ఐటీడీఏ..

జీసీసీ సూపర్‌మార్కెట్ల నిర్వహణపై ఐటీడీఏ చేతులెత్తేయడంతో మూతబడే దిశగా కనిపిస్తున్నాయి. జీసీసీ సూపర్‌మార్కెట్లు, విక్రయ కేంద్రాలలో 15 రకాల అటవీ ఉత్పత్తులను సేకరించి సూపర్ మార్కెట్‌లలో అందుబాటులో ఉంచాలి. కానీ ఒకటి రెండు ఉత్పత్తులతోనే సరిపెడుతున్నారు. కేవలం తేనె నిల్వలనే అందుబాటులో ఉంచుతున్నారు. మిగితా 14 రకాల ఉత్పత్తులు కనిపించకుండానే పోతున్నాయి. ఇందులో ఇప్పపువ్వు, ఇప్పగింజలు, తేనె మైనం, మారెడు గడ్డలు, చింతపండు, ఎండు ఉసిరి పప్పు, విష ముష్టి గింజలు, చిల్లగింజలు, నరమామిడి చెక్క, కరక్కాయలు, కుంకుడుకాయలు, నల్లజీడిగింజలు, కానుగ గింజలను అందుబాటులో ఉంచడం లేదు. ఆయుర్వేద మందుల తయారీలోను అటవీ ఉత్పత్తులను విరివిగా ఉపయోగిస్తారు. పేరుకే గిరిజన సూపర్‌మార్కెట్ అయిన ఇతర మార్కెట్ల మాదిరిగానే విక్రయాలు జరుగుతున్నాయి. అటవీ ఉత్పత్తులను సేకరించి అందుబాటులో ఉంచితే వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంతో పాటు జీసీసీకి అధిక ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది. అలాగే గిరిజనులు సేకరించిన అటవీఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడుతుంది. బయట మార్కెట్‌లో అటవీ ఉత్పత్తుల వినియోగం, వాటి ఉపయోగాలపై అధికారులు ఏ మాత్రం ప్రచారం

(...మిగతా 6వ పేజీలో)



ఉపాధ్యాయుడికి ఫేక్‌కాల్

భీంపూర్ , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న అట్ల అశోక్ అనే ఉపాధ్యాయునికి సోమవారం ఉదయం 10 గంటలకు ఫేక్‌కాల్ వచ్చింది. ఫోన్‌లిఫ్ట్ చేసి మాట్లాడుతుండగా నీ కుమారుడు డ్రగ్స్ (మత్తుపదార్థాలు) వాడుతుండగా పట్టుకున్నామని మీ బాబుకు ఫోన్ చేయవద్దని, ముందు డబ్బులు పంపమని హెచ్చరించారు. దీంతో అప్రమత్తం అయిన సదరు ఉపాధ్యాయుడు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్న ఆయన కుమారునికి ఫోన్ చేశాడు. ఆయన కుమారుడు అభిషేక్ నేను క్షేమంగానే ఉన్నానని, అలాంటి ఫేక్‌కాల్స్ వస్తే నమ్మవద్దని తండ్రికి సూచించారు.

తక్కువ వడ్డీకే రుణాలు

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

తాంసి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సహకార సొసైటీ పరిధిలో రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రతిరైతు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంలో వార్షిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఈవో కేశవ్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

ఇంద్రవెల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హోటళ్ళు, దాబా, టిఫిన్ సెంటర్ నిర్వాహకులతో స్వచ్ఛత, నాణ్యత పాటించాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండల కేంద్రానికి చెందిన హోటల్స్, దాబా, టిఫిన్ సెంటర్ నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఫుడ్‌పాయిజన్ కేసులు పెరుగుతున్నాయన్నారు. హోటల్స్, దాబా, టీ స్టాల్స్‌లలో స్వచ్ఛత పాటించడంతో పాటు నాణ్యత పాటించాలని సూచించారు.

పూర్తి వివరాలు నింపండి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- సర్వే పనితీరు పరిశీలన
- అధికారులకు సూచన



సర్వే తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ఫారంలో ఉన్న ప్రశ్నలన్నింటినీ అడిగి పూర్తి వివరాలు పూరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ, వాన్‌వాట్ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న తీరును నిర్ణీత ఫారాల్లో ఆయా కోడ్‌ల వారీగా వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. యాపల్‌గూడ, వాన్‌వాట్‌ల్లో సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కులగణన నమోదు తీరును దగ్గరుండి పరిశీలించి, ఫారంలో ఉన్న ప్రశ్నల న్నిటిని అడిగి పూర్తి వివరాలు ఫారంలో పూరించాలన్నారు. స్టార్ గుర్తు ఉన్న వాటిని తప్పకుండా తప్పులు లేకుండా, కొట్టివేతలు లేకుండా పూరించాలన్నారు. విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో ఆ సబ్జెక్టులపై ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వాన్‌వాట్ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశార్ స్టోర్ రూమ్, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ప్రారంభం



జెండా ఊపి రన్నింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

ఉట్నూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) క్రీడల్లో రాణిస్తున్న వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో మేస్రం మనోహర్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురం క్రీడా మైదానంలో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలను ఐటీడీఏ ఏసీఎంవో ఆత్రంజగన్‌తో కలిసి ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో బాలుర అథ్లెటిక్స్ ఖోఖో పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐటీడీఏ ద్వారా వీరిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కాంతారావు మాట్లాడుతూ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు ఖమ్మంలో ఈనెల 17 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. అదే విధంగా ఖోఖోపోటీలు వికారాబాద్ హైదరాబాద్‌లో జరిగాయని రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిలాబాద్ జట్టు ప్రథమ స్థానంలో, ఆసిఫాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో విజయం సాధించాయన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్, హెచ్‌ఎం ఉత్తమ్, పీడీలు జాదవ్‌హేమంత్‌నాయక్, పవర్‌లక్ష్మణ్, జలపతి, కోచ్‌లు సునంద్, సాహు, దర్శనందేవేందర్, రాకేష్, జ్యోతిశ్వారాన్‌లు పాల్గొన్నారు.

మధ్యాహ్నం వరకు నిలిచిన పత్తి కొనుగోళ్లు

- వ్యాపారులతో అధికారుల చర్చలు
- అనంతరం కొనుగోళ్లు ప్రారంభం



నిలిచిపోయిన పత్తి బండ్లు

ఆదిలాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు కాటన్‌జిన్నింగ్ అండ్ ప్రెసింగ్ ఇండస్ట్రీస్ యజమానులు ప్రకటించడంతో ఆదిలాబాద్ మార్కెట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచి పోయాయి. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పత్తి కొనుగోళ్లు నిలిచి పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వందలాది మంది రైతులు గంటల తరబడి మార్కెట్‌లోనే పడిగాపులు కాశారు. దీంతో పత్తి రైతులు ఆందోళనకు దిగారు. అధికారులు ప్రైవేట్ వ్యాపారులతో చర్చలు జరపడంతో పత్తి కొనుగోళ్లు తిరిగి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పత్తి వ్యాపారుల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాపారులు, జిన్నింగ్ యజమానులు తిరిగి పత్తి కొనుగోళ్లను చేపట్టారు. దీంతో అధికారులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సీసీఐ అవలంభిస్తున్న ఎల్1, ఎల్2, ఎల్3 విధానాన్ని వ్యతిరేకిస్తూ పత్తి వ్యాపారులు నిరసనకు దిగారు. కొనుగోళ్లు ప్రారంభంకావడంతో పత్తి రైతులకు ఇబ్బందులు తప్పాయి.

సీసీఐ యథావిధిగా పత్తిని కొనుగోలు చేస్తుంది

ఆదిలాబాద్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ ఆధ్వర్యంలో పత్తిని కొనుగోలు చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెసింగ్ ఇండస్ట్రియల్ వ్యాపారులు సోమవారం పత్తిని కొనుగోలు చేసేందుకు నిరాకరించినట్లు వచ్చిన ఆరోపణలు తప్పని, అందులో సీసీఐ కఠిన నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్న విషయం పూర్తిగా అవాస్తవమన్నారు. సీసీఐ నిబంధనల ప్రకారం మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులు మార్కెట్‌కు పత్తిని తీసుకొచ్చి విక్రయించాలని సీసీఐ అధికారులు కోరారు.

ఖత్రి సమాజ అభివృద్ధికి కృషి

- ఎంపీ గోడం నగేష్

మావల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఖత్రి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు పేర్కొన్నారు. ఖత్రి సమాజ్ వారి నేతృత్వంలో మావలలో నిర్మించిన శ్రీ సోమా వంశీయా సహా స్రార్జున్ సమాజ్ భవనాన్ని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఖత్రి సమాజ్ వారు కృషి పట్టుదలతో ముందుకు సాగి లక్ష్యాన్ని చేరుకుంటారని కొనియాడారు. జనాభాలో అల్ప సంఖ్యాకులైన అందరూ ఒకే బాటలో నడుస్తూ, మిగితా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ విశ్వనాథ్, రవీందర్, అధ్యక్షుడు అదిత్య ఖండేష్కర్, బండేవార్ రాజ్ శ్రీనివాస్, బండేవార్ సతీష్, ఖాండేష్, ఉత్తమ్‌కుమార్, గుజరాతి నాగేశ్వర్, బచ్చేవర్ కిషోర్‌కుమార్, మామిడి రాజు, మామిడిశేఖర్, గుజరాతి పవన్, బాదం స్వామి, భారడి బాబురాజా, నాకోడ్ శివాజీ, గుజరాతి చంద్రశేఖర్, సందీప్ పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ నగేష్

తాంసి పోలీస్‌స్టేషన్ తనిఖీ

తాంసి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఎస్పీ గౌస్ ఆలంకు డీఎస్పీ జీవన్‌రెడ్డితో పాటు సీఐ ఫణీందర్‌లు స్వాగతం పలికారు. సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. అదే విధంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై శివరాంకు పలు సూచనలు చేశారు. ఎళ్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించాలని చెప్పారు. సీసీ కెమెరాలు అమర్చే విధంగా చూడాలన్నారు ఆయన వెంట డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐ ఫణీందర్ ఉన్నారు.

ఉట్నూర్‌లో విశ్వ విద్యాలయం అవసరం

● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

ఉట్నూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) :ఉట్నూర్‌లో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తానని కరీంనగర్ అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఉద్యోగులు, పట్టభద్రులతో నిర్వహించి ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్ జిల్లాకు మంజూరు అయిన విశ్వవిద్యాలయం వరంగల్ ప్రాంతానికి తరలిపోయిందన్నారు. గిరిజన జిల్లా అయినందున ఉట్నూర్‌లో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు విద్యార్థులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా ప్రభుత్వ వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు.

బలహీన వర్గాల కోసం పార్టీ కృషి

● కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేదబడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కందిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రజాసేవ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో భారీఎత్తున పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఆదిలాబాద్‌రూరల్, చాందా(టీ) గ్రామాల ప్రజలు చేరారు. వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సోదరులు తనను గెలిపించడానికి చాలా కష్టపడ్డారని, రోజు రోజుకు కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్‌రావు, ఎంఏ.షకీల్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, ఆదిలాబాద్ రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాగన్న పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ఉట్నూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ మండల కేంద్రంలోని కొత్తకుంటలో చేపల వేటకు వెళ్లిన ఒకరు ప్రమాదవశాత్తు వల కాళ్లకు తట్టుకొని మృతి చెందిన సంఘటన ఉట్నూర్‌లో చోటు చేసుకుంది. ఆదివారం ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన లచ్చన్న(48) ఆదివారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఇంటిల్లిపాది అయన ఆచూకీ కోసం ఆరా తీశారు. కొత్తకుంటలో చేపల వేటకు వెళ్లినట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి చూడగా ఆదివారం రాత్రి 11 గంటలకు కాళ్లకు వల చిక్కుకొని ఉండడంతో మృతిచెందినట్లు గుర్తించారు. కొడుకు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టంకు శవాన్ని పంపామని సబ్‌ఇన్‌స్పెక్టర్ మనోహార్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

సిరికొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం సిరికొండ మండలంలో నారాయణ్‌పూర్, రాజులగూడ, జెండాగూడ, నేరడిగొండ(జీ), నేరడిగొండ(కే), చిన్నగోదుమల్లె గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో సమస్యలను అడిగి తెలుసుకుని, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా నారాయణ్‌పూర్ గ్రామంలో ఇటీవల గ్రామపటేల్ చిత్రుపటేల్ కుటుంబసభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో కాసేపు ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సర్వేతో అనేక ప్రయోజనాలు : ఎమ్మెల్యే బొజ్జుపటేల్



వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సామాజిక ఆర్థిక రాజకీయ సమగ్ర కుటుంబ సర్వేతో ప్రతి ఒక్కరికి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, కొందరు పనిగట్టుకొని సర్వే పై విమర్శలు చేయడం సరైనది కాదని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమబొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని ఘన్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే స్వగ్రామం కల్లూరిగూడలో సమగ్రకుటుంబ సర్వే జరిగింది. ఇందు కోసం వచ్చిన బృందానికి తన తల్లి దండ్రులు వెడమ గిరిజబాయి, విడమ భీమ్రావు, తన సతీమణి ద్రుపద, పిల్లలు తనీష్, నితీష్‌ల వివరాలతో కూడిన కుటుంబ సభ్యుల వివరాలను సర్వే బృందానికి వివరించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వంచేపట్టిన సర్వే బృందం వారికి వివరములు తెలుపకుండా కొందరు తప్పుతోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం చేపట్టినసమగ్ర కుటుంబ సర్వే వివరాలు బయటకు పెట్టకుండా ప్రభుత్వం ఏమి చేసిందో తెలియకుండా పోయిందని, అందుకే దేశంలో ఆదర్శంగా ఉండడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక ఆర్థిక రాజకీయ కులగణన చేపట్టడం జరుగుతుందన్నారు. బృందంలో ఎంపీడీఓ రాంప్రసాద్, ఎంపీఓ మహేశ్‌కుమార్, గ్రామ ప్రత్యేక అధికారి సురేందర్, కార్యదర్శి బొడప్రవీణ్‌కుమార్, ఎన్యుమరేటర్ కురిసింగ సూర్యభన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖయ్యుం, నాయకులు రాజేశ్‌నాయక్, కొత్తపల్లి మహేందర్, ఆత్రం రాహుల్ తదితరులున్నారు.

ఉట్నూర్ : స్వాతంత్ర సమరయోధుడు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతర మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు.

ఏఎన్‌ఎంల ధర్నా

ఉట్నూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంల పెండింగ్ వేతనాలు విడుదల చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ముందు ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టేకం ప్రభాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అన్నమొల్ల కిరణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలు ఏఎన్‌ఎంలు నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొజ్జఆశన్న, శ్యాంసుందర్, కమల, కామేశ్వరి, అనిత, శ్యామల, నర్మదా, జంగుబాయి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

నేరడిగొండ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి):ప్రథమ స్థాయిలో విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దవచ్చునని మండల విద్యాధికారి భూమారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీపీఎస్ వడూర్ మండల ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని పాఠశాలలో ప్రారంభించారు.

రైతు సంఘాల ధర్నా

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పత్తి ధరకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షం రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తేమ శాతం నిబంధనను సడలించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకాన్ని వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దత్తాత్రి, కిష్టు, నారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కలెక్ట రేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మాసిటీ భూ సేకరణ కోసం వెళ్లినప్పుడు జిల్లా కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై గ్రామస్తులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని రెవెన్యూ ఉద్యోగుల సంఘం సభ్యులు తెలిపారు. చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఓపీ బ్లాక్‌లోని డైస్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత గ్రహణ మొర్రి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హైదరాబాద్ ఏవీఆర్ హాస్పిటల్ వైద్యులు 0-18 సంవత్సరాలు వయసు గల పిల్లలకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్య శిబిరాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పర్యవేక్షించారు.

ట్రాలీ ఆటో బోల్తా

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల ఘాట్ రోడ్డు సమీపంలో సోమవారం ఓ ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. నిత్యవసర సరుకులతో కూడిన ట్రాలీ ఏజెన్సీ ఖండాల ఘాట్ పొత్త గూడ రహదారి మధ్యలో అదుపు తప్పి పడిపోయింది.

మూతబడుతున్నాయ్..!

(5వ పేజీ తరువాయి)

కూడా చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

● ఇతర ప్రాంతాలకు వలస బాట..

స్థానికంగా ఉపాధి దొరకకపోవడంతో ఆదివాసీ గిరిజనులు ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు. గిరిజన తెగలలో కొన్ని తెగలు పూర్తిగా అటవీ ఉత్పత్తులపైననే ఆధారపడి జీవిస్తాయి. ఇలాంటి వారికి అండగా నిలవాల్సిన ఐటీడీఏ అధికారులు ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో ఉపాధి అవకాశాలు దూరమవుతున్నాయి. తరతరాలుగా అటవీ ఉత్పత్తులనే నమ్ముకుంటూ వస్తున్న ఆదివాసీలు ప్రస్తుతం ప్రత్యామ్నాయ మార్గాలను వెతు క్కుంటున్నారు. అడవుల్లో సేకరించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో ఆసక్తి చూపడం లేదు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్తూ కూలీలుగా మారి పరిశ్రమలు, హోటళ్లు, కిరాణ షాపులు, రెడీమేడ్ షోరూంలలో పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. గిరిజనులకు స్థానికంగానే ఉపాధిని కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నా అందని ద్రాక్షగానే మారుతున్నాయి. గిరిజనుల సమాగ్రాభివృద్ధికి ఐటీడీఏను ఏర్పాటుచేసినా ఏ మాత్రం ప్రయోజనం లేదంటున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడదూరంగానే గిరిజన గూడాలు కనిపిస్తున్నాయి. ఉపాధి అవకాశాలు దూరం కావడంతో ఆదివాసీలను పేదరికం వెంటాడుతూనే ఉంది.

మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

బోథ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన బోథ్ పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మల్లెపూల శివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయనను మండల మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు ఎలక రాజు సన్మానించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ మున్నూరు కాపుల సంక్షేమానికి పాటుపడుతూనే ఇతర కులాల వారికి అన్ని విధాలుగా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల మాల సంక్షేమ సంఘం నాయకులు బోడ లక్ష్మణ్, సెక్రటరీ మునేశ్వర్, సోమన్న, నాయకులు రమణయ్య, బక్కు వారి సురేందర్, కామెర వినోద్‌లు పాల్గొన్నారు.

సేవ చేసే వారిని గుర్తుంచుకుంటారు : ఎంపీడీవో

బోథ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాలను చేసే వారిని ప్రజలు గుర్తుంచుకుంటారని మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాసం కిరణ్ జ్ఞాపకార్థం చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం వల్ల పేద ప్రజలు గుర్తించుకుంటారన్నారు. గతంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో అవసరమైన వారికి కంటి అద్దాలు సోమవారం ఎంపీడీవో చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో మంచి పేరు సంపాదించుకున్న వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ మాసం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. 100 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం 60 మందికి అందిస్తున్నామని మరో 40 మందికి కంటి అద్దాలు త్వరలో అందిస్తామన్నారు.

వరంగల్ పత్తి మార్కెట్‌ను సందర్శించిన ఏఎంసీ చైర్మన్



వరంగల్ మార్కెట్ కమిటీ సెక్రటరీని కలిసిన బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్

బోథ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో పత్తి సాగుచేస్తున్న రైతులు ఎవ రూ నష్టపోకుండా ఉండేందుకు వరంగల్ జిల్లాలో పత్తిపంట కొనుగోళ్లను పరిశీలించడం జరుగుతుందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు. శీతోష్ణస్థితి పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడం జరుగుతుందని సీసీఐ జన్నింగ్ మిల్లుల మధ్య పొరపాటు రాకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా తీసుకునే చర్యలపై అధికారులతో మాట్లా డుతున్నామన్నారు. పత్తి పంట కొనుగోలులో రైతులు వ్యాపారస్తుల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించడం జరుగుతుందన్నారు. అయితే ఈ సందర్భంగా బోథ్ మార్కెట్ కమిటీ సెక్రటరీగా పని చేసే బదిలీ అయిన అక్కడి వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ రామోజీ రామును కలవడం జరిగిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సీనియర్ నాయకులు గాజుల పోతన్నలు ఉన్నారు.

సమస్యలకు నిలయంగా ఆశ్రమ పాఠశాలలు

గిరిపుత్రులకు భోజనవసతితోపాటు మెరుగైనవిద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమపాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమపాఠశాలలపై ఉన్నతాధికారులు నిర్లక్షవైఖరిని అవలంబిస్తుండడంతో పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు సమస్యలతో సహవాసం చేయల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. బోధనపై శ్రద్ధ తీసుకుంటున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- వాంకిడి





పనిచేయని సోలార్ వేడినీటి యంత్రాలు

- దుప్పట్ల పంపిణీ లేదు.. వేడినీటి యంత్రాలు లేవు
- కనీస వసతులు లేక విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

జిల్లాలో 45 గిరిజన ఆశ్రమపాఠశాలలు ఉండగా 12,327మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, డైనింగ్‌హాల్, శుద్ధజలం, తదితర సమస్యలు వేధిస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు వేడి నీళ్లు అందించేందుకు ఏర్పాటుచేసిన సోలార్ వేడినీటి యంత్రాలు చెడిపోయి ఏళ్లు కావస్తున్నా అధికారులు మరమ్మతులు చేయడంలేదు. దీంతో విద్యార్థులు చన్నీళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం చలికాలం కావటంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. పాఠశాలల్లో డైనింగ్‌హాల్ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోని చెట్ల కిందనీడలో, గదుల ముందు వరండాల్లో విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. వంటశాలలు లేకపోవడంతో వంటకాలు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో తరగతి గదుల్లోనే విద్యార్థులు నిద్రించాల్సి వస్తోంది.

● పంపిణీ కాని దుప్పట్లు

కనిష్టస్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో పాఠశాలల్లో 200నుంచి 500లకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో కొందరు జ్వరం, జలుబు, చర్మవ్యాధులు, రక్తహీనతతోపాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చలికాలం ఆరంభంలో పంపిణీచేసే దుప్పట్లు నేటివరకు ఐటీడీఏ అధికారులు పంపిణీ చేయలేదు. దీంతో విరిగిన తలుపులు, ఊడిన కిటికీలతో ఆశ్రమపాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చలికి గజగజ వణు కుతూ కాలం వెళ్లదీస్తున్నారు. అంతేగాక వసతిగృహాల్లో ఏఎస్‌ఎం పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యార్థులకు సకాలంలో వైద్యం అందడం లేదు. విద్యార్థులకు రాత్రి, పగలు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ఆశ్రమపాఠశాలల్లో ప్రథమచికిత్స చేయడానికి ఏఎన్‌ఎంలు అందుబాటులో లేక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లక తప్పడంలేదు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

● మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు

జిల్లాలోని ఆశ్రమపాఠశాలల్లో విద్యా ర్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు, ఉన్న కొన్నిచోట అధ్వానంగా మారాయి. దీంతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అనేక పాశాలలకు డైనింగ్ హాల్‌లేకపోవడంతో అపరిశుభ్ర వాతావరణంలో వరండాల్లో, చెట్లకింద భోజనాలు చేస్తుండడంతో తరచూ విద్యార్థులు అనారోగ్యానికి గురవు తున్నారు. వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో 571మంది విద్యార్థినులకు గాను కేవలం 20మరుగుదొడ్లు మాత్రమే ఉ న్నాయి. బంబార ఆశ్రమ పాఠశాలలో 299మంది విద్యార్థులకు కేవలం 10 మాత్రమే పనిచేస్తున్నాయి. ఇలా జిల్లా లోని అనేక ఆశ్రమ పాఠశా లల్లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిసంవత్సరం పాఠశాలల్లో అవ సరంఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మా ణానికి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపించడమే తప్ప నిధులు మంజూరై నిర్మాణాలు చేపట్టిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి ఆశ్రమపాఠశాలల్లో అన్నివిధాల వసతులు కల్పించి విద్యార్థు లకు మెరుగైన విద్యను అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వెంకన్న ఆలయానికి కార్తీకశోభ



ఖానాపూర్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి మంగళహారతులతో తరలివచ్చిన మహిళలు

ఖానాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప ద్మావతి నగర్‌లో గల శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం కార్తీకశోభను సంతరించుకుంది. పవిత్రమైన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సోమ వారం తెల్లవారు జామున ఆలయంలో కాగడాల హారతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళహారతులతో తరలివచ్చిన మహిళలతో పట్టణ పురవీధులలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని వి ద్యుత్‌దీపాలతో అలంకరించారు. యజ్ఞచార్యులు చక్రపాణి నరసింహామూర్తి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు కొనసా గాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆయన కార్తీకమాస విశిష్టతను తెలియజేశారు.

శబరిమలకు మహాపాదయాత్ర

తానూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోసి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌యాదవ్ అనే అయ్యప్ప స్వామి సోమవారం శబరిమలకు పాదయాత్ర ప్రారంభించారు. 41రోజుల మండల దీక్షను స్వీకరించి కేరళలోని అయ్యప్ప స్వామి సన్నిధి శబరికి పాదయాత్రగా బయలుదేరాడు. తమ గ్రామం, పాడి పంటలతో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ పాదయాత్రగా రెండవ సారి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురుస్వాములు శివకుమార్ గురుస్వామి, నాగనాథ్‌గురుస్వామి, మురళిగురుస్వామిలు శాలువతో సత్కరించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మంగళహారతులతో ఘనంగా సాగనంపారు.

ఘనంగా కార్తీక మాసపూజలు

కుంటాల, నవంబర్, 11: (ఆంధ్రజ్యోతి) కుంటాల మండలంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని అన్ని గ్రామాలలో ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా మహిళలు ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. ఓలా, కుంటాల, సూర్యాపూర్ శివాలయాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

తప్పుల్లేకుండా సమగ్ర సర్వే చేపట్టాలి

కుభీర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలో నిర్వహించే సమగ్ర సర్వే తప్పుల్లేకుండా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమగ్ర సర్వేను పరిశీలించారు. నమోదు ప్రక్రియ ఎలా జరుగుతుందోనని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, సర్వేఅధికారి సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, తదితరులున్నారు.

రైతులకు ల్యాండ్ డెవలప్‌మెంట్ రుణాలు ఇవ్వాలి

ఖానాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సత్తనపెల్లి పీఏసీఎస్ పరిధిలోని 10 గ్రామాల రైతులకు ల్యాండ్ డెవలప్‌మెంట్ రుణాలను అందజేసి వారి అభివృద్ధికి సహకరించాలని ఏడీసీసీ మేనేజర్ కల్పనను సోమవారం సత్తనపెల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్ కోరారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

నిర్మల్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న, కేంద్ర తొలి విద్యా శాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహిం చారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి అందించిన సేవలను వక్తలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ విద్యావ్యవస్థను తీర్చిదిద్దిన మహనీ యుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, సీపీవో జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, మెప్మా పీడీ సుభాష్, మైనార్టీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలాం జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. కలాం గుణం ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్, సభ్యులు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేనివని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నా రు. సోమవారం మండల కేంద్రంలో పలుచోట్ల నిర్వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వేర్వేరు కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, మాజీ ఎంపీపీ అబ్దుల్ మోహిద్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, నాయకులు తదితరులు ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, ఎనిమి దవ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, తదితరులు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

భైంసా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని మైనారిటీ పాఠశాలలో సోమవారంమౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, వైస్ చైర్మెన్ ఫారుఖ్ ఆహ్మద్, ఎస్ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా ప్రతినిధి షేక్ అంజాద్‌లు అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ట్రిపుల్ ఐటీలో ఉద్రిక్తత

- మరో విద్యార్థిని ఆత్మహత్య
- క్యాంపస్ ముట్టడికి ఏబీవీపీ ప్రయత్నం
- సీఐ అత్యుత్సాహం
- కర్రలతో సెక్యూరిటీ సిబ్బంది దాడి
- ఏబీవీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- 6 గంటల పాటు బాధిత తల్లిదండ్రులతో చర్చలు
- విద్యార్థి మృతికి సీనియర్ యువకుడి వేధింపులే కారణం !?


విద్యార్థిని మృతదేహం


స్వాతి ప్రియ (ఫైల్)


వెళ్లిపోయావా.. బిడ్డా..!

బాసర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వర్సిటీలో విద్యార్థిని, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన స్వాతిప్రియ (17) ఆత్మహత్య చేసుకోవడంతో క్యాంపస్ ముట్టడి రణరంగానికి దారి తీసింది. క్యాంపస్ సీఐ ఆదేశాలతో సెక్యూరిటీ సిబ్బంది కర్రలతో ఏబీవీపీ కార్యకర్తలపై విరుచుకుపడ్డారు. కర్రలతో బాదడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కార్య కర్తల్లో ఒకరి తల పగలి తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే అతన్ని భైంసా ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో బాధితున్ని నిజామాబాద్ ఆసుపత్రికి పంపించారు.

సీఐ అత్యుత్సాహం.. సెక్యూరిటీ సిబ్బంది వీరంగం

ఏబీవీపీ కార్యకర్తలు సుమారు 15 మంది నిరసన తెలిపేందుకు క్యాంపస్ ప్రధాన గేటు వద్దకు చేరుకున్నారు. అక్కడున్న సివిల్ పోలీసులు, యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో అక్కడికి సివిల్ డ్రెస్‌లో చేరుకున్న యూనివర్సిటీ సీఐ.. ఏబీవీపీ కార్యకర్తలపై విరుచుకుపడ్డాడు. ఒక్కొక్కరిని తోసేస్తూ హడావుడి సృష్టించాడు. అక్కడే ఉన్న సివిల్ పోలీసులు శాంతియుతంగా కట్టడి చేస్తున్న సమయంలో.. సీఐ ఆదేశాలివ్వడంతో యూనివర్సిటీ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది కర్రలతో వీరంగం సృష్టించారు. ఇష్టానుసారంగా ఏబీవీపీ కార్యకర్తలపై దాడి చేశారు. దొరికినోళ్లను దొరికినట్లు బాదుతూ పరుగెత్తించారు. దాదాపు అరగంటపాటు ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ తీరుతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. సివిల్ పోలీసుల సమక్షంలోనే ఇదంతా జరిగింది.

స్వాతిప్రియకు సకాలంలో చికిత్స అందించి ఉంటే..

స్వాతిప్రియ సోమవారం ఉదయం తోటి విద్యార్థులు అల్పాహారం కోసం మెస్సులకు వెళ్లిన సమయంలో ఉరివేసుకుంది. ముందుగా తోటి విద్యార్థికి మెసేజ్ పెట్టడంతో వెంటనే ఆ విద్యార్థి అప్రమత్తమై హాస్టల్‌కు వచ్చి అక్కడున్న సిబ్బందికి చెప్పినట్లు తెలిసింది. హౌజ్ కీపింగ్ సిబ్బంది వేలాడుతున్న స్వాతి ప్రియను వెంటనే కిందికి దించినప్పటికి అక్కడ ఉన్నవారు అధికారులు వచ్చే వరకు తీసుకెళ్లేది లేదని చెప్పడం వల్ల ఆసుపత్రికి తరలించడంలో జాప్యం జరిగినట్లు సమాచారం. లేదంటే కొన ఊపిరితో ఉన్న స్వాతిప్రియను (17) వెంటనే క్యాంపస్‌లో ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తే ప్రాణాలతో బయటపడే అవకాశం ఉండేది.


ఏబీవీపీ కార్యకర్తలపై కర్రలతో దాడి చేస్తున్న యూనివర్సిటీ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది


ఏబీవీపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న యూనివర్సిటీ సీఐ, సెక్యూరిటీ సిబ్బంది

సీనియర్ ఇంజనీరింగ్ అబ్బాయి వేధింపులే కారణమా..

స్వాతిప్రియ ఆత్మహత్యపై వారి బంధువులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్వాతి ప్రియ తన స్నేహితురాలి ప్రేమ వ్యవహారంలో జోక్యం చేసుకోవడమే ఆమె పాలిట శాపంగా మారినట్లు తెలిసింది. చేసేది తప్పు అంటూ స్నేహితురాలికి చెప్పడం.. అది కాస్త స్నేహితురాలి ప్రియుడు, సీనియర్ విద్యార్థి వేధింపులకు కారణమైంది. ఇదే విషయమై గత కొన్ని రోజుల నుంచి స్వాతిప్రియకు, సీనియర్ విద్యార్థికి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో గత అక్టోబర్ 4వ తేదీన స్వాతిప్రియ తన తండ్రి సూచన మేరకు హాస్టల్ చీఫ్ వార్డెన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. నవంబర్ 3వ తేదీన అడిషనల్ చీఫ్ వార్డెన్ రిసీవ్ చేసుకున్నట్టు సంతకం ఉంది. అంటే దాదాపు నెల రోజుల పాటు అధికారులు ఈ విషయమై నిర్లక్ష్యం వహించినట్లు స్పష్టమవుతోంది. ఇదే విషయమై సదరు సీనియర్ విద్యార్థిని అధికారులు ఇటీవల ఇదే కారణంతో సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో సదరు యువకుడు ఆదివారం స్వాతిప్రియతో మళ్లీ గొడవకు దిగడం వల్లనే ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చునని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తల్లిదండ్రులతో 6 గంటల పాటు చర్చలు

విషయం తెలియగానే విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు క్యాంపస్‌కు చేరుకున్నారు. అప్పటికే మృతదేహాన్ని అధికారులు పోస్టుమార్టం కోసం భైంసాకు తరలించారు. రాకముందే మృతదేహాన్ని తరలించడంపై కుటుంబ సభ్యులు యూనివర్సిటీ అధికారులను నిలదీశారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం ఉండడం వల్లనే మృతదేహాన్ని కావాలని పోస్టుమార్టం కోసం తరలించినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. హాస్టల్ గదిలో తమ కూతురికి సంబంధించిన సూట్‌కేసు, బ్యాగులను అన్నింటినీ అధికారులు వెతికారని తప్పు చేయకపోతే అలాంటి పనులు ఎందుకు చేశారనే అనుమానం వ్యక్తం చేశారు. సీనియర్ ఇంజనీరింగ్ యువకుడు వేధించడం వల్లే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకుందని లెటర్ రాసి ఫిర్యాదు చేసినా వర్సిటీ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ పాప చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కర్రలతో దాడి ఘటనపై పోలీసుల సీరియస్

యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది ఏబీవీపీ కార్యకర్తలపై కర్రలతో దాడి చేసిన ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ క్యాంపస్‌కు వచ్చి విచారించారు. ఏబీవీపీ విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. క్యాంపస్‌లో సీసీ కెమెరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన వీడియోలు చూసి ఏఎస్పీ క్యాంపస్ సీఐ, సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

వ్యక్తిగత కారణాలతోనే.. : యూనివర్సిటీ అధికారులు

స్వాతి ప్రియ ఆత్మహత్యపై యూనివర్సిటీ అధికారులు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకుందని వారు తెలిపారు.

మృతదేహంపై రోదించి.. సొమ్మసిల్లిన తల్లిదండ్రులు

- సోదరి పాదాలకు మొక్కుకుంటూ వెక్కివెక్కి ఏడ్చిన తమ్ముడు

భైంసా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీలో సోమవారం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతిప్రియ కుటుంబీకుల రోదనలతో భైంసా ఏరియా ఆసుపత్రి దద్దరిల్లిపోయింది. ఉదయం వేళలో విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాసర ట్రిపుల్ ఐటీ నుంచి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం వేళలో ఇక్కడకు వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు ఉజ్వల, రవీందర్‌లు పోస్టుమార్టం గదిలోని తమ కూతురు మృతదేహాన్ని చూసి సొమ్మసిల్లి పడిపోయారు. కుటుంబసభ్యులు వారిద్దరికీ సపర్యలు చేయగా.. స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం తేరుకున్న వారిద్దరూ కూతురి మృతదేహాన్ని చేతుల్లోకి తీసుకొని పెద్దపెట్టున రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలోకి తరలిస్తున్న సమయంలో తల్లిదండ్రులు అడ్డుకొని పోస్టుమార్టం చేయకుండా తమ కూతురిని అలానే ఇవ్వాలంటూ వైద్యులను ప్రాధేయపడిన తీరు అక్కడి వారందరితో కంటతడి పెట్టించింది. మృతురాలి తమ్ముడు ఓం సాయి తన సోదరి పాదాలకు మొక్కుకుంటూ.. 'ఎంత పని జరిగిందంటూ అక్కయ్యా'.. అంటూ వెక్కివెక్కి ఏడవడం అందరినీ కలిచివేసింది.

స్వాతి ప్రియ మృతిపై అనుమానాలు : కుటుంబీకులు

స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకునే పిరికిది కాదని ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వెల్లడించారు. సోమవారం సాయంత్రం భైంసాలో విలేకరులతో మాట్లాడారు. స్వతహాగా ఎంతో ధైర్యంతో వ్యవహరించే స్వాతి ప్రియ ఆత్మహత్యకు పాల్పడిందంటే తాము విశ్వసించడం లేదన్నారు. మృతిపై తమకు అనుమానాలున్నాయని చెప్పారు. వారిని అడ్డుకున్న పోలీసు అధికారులతో కుటుంబీకులు తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగారు. తామెవరు రాకుండా మృతదేహాన్ని తరలించడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలుపుతూ బాసర ఎస్సైపై బాధిత కుటుంబీకులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. భైంసా టౌన్ సీఐ గోపినాథ్ వారిని శాంతపరిచారు.

పోలీసు అధికారిపై మృతురాలి తల్లి ఆగ్రహావేశాలు

విద్యార్థిని స్వాతిప్రియ తల్లి ఉజ్వల పోలీసు అధికారిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేసింది. భైంసాలోని ఏరియా ఆసుపత్రి పోస్టుమార్టం గదిలో కూతురు మృతదేహాన్ని చూసే సమయంలో అక్కడే ఉన్న బాసర ఎస్సై గణేష్‌పై కోపంతో ఊగిపోయింది. ఘటనా స్థలి నుంచి మృతదేహాన్ని తమకు చెప్పకుండా ఎందుకు తరలించావంటూ ఆగ్రహంతో.. ఎస్సై దగ్గరికి వెళ్లి చొక్కా పట్టుకొని నిలదీసింది. పక్కనే ఉన్న పలువురు ఆమెను విడిపించారు.


ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకున్న హాస్టల్ గదిని పరిశీలిస్తున్న నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల


పోలీసు అధికారితో మృతురాలి కుటుంబీకుల వాగ్వాదం


ఎస్సైని ప్రశ్నిస్తున్న విద్యార్థిని తల్లి


సొమ్మసిల్లిన విద్యార్థిని తండ్రి రవీందర్



ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఏబీవీపీ కార్యకర్తలు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

- అట్టహాసంగా ప్రారంభమైన గురుకుల జోనల్ స్థాయి క్రీడలు
- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- క్రీడలతోనే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించొచ్చు : ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

ముథోల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా క్రీడల్లో సైతం రాణించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముథోల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బాలుర విభాగంలో పదో జోనల్ స్థాయి క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రముఖ పాఠశాలగా పేరు ప్రఖ్యాతులు పొందిన ముథోల్ గురుకుల పాఠశాలకు పూర్వ వైభవంగా తీసుకు రావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులు జాతీయ స్థాయిలోని ప్రముఖ విద్యాసంస్థల్లో సీటును సాధించి ఉన్నత స్థాయికి ఎదగడం తమ ప్రాంతానికి ఎంతో గర్వకారణం అన్నారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి జోనల్ స్థాయి క్రీడలు దోహదపడడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో భారత దేశం పేరు ప్రఖ్యాతులు క్రీడా ప్రపంచంలో మారుమోగడానికి కారణం విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రదర్శిస్తున్న క్రీడా నైపుణ్యమే అని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగు పరచడానికి తనవంతుగా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సైతం క్రీడలతో పాటు విద్యను అభ్యసించి పోషకులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నాలుగు రోజుల పాటు జరిగే క్రీడా సంగ్రామంలో విద్యార్థులు తమలోని అత్యుత్తమ ప్రదర్శన వెలికి తీసే వేదికగా భావించి ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ఐదు జిల్లాలలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలకు చెందిన 1020 మంది క్రీడాకారులు, సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ జాతీయ జెండాను - ఒలంపిక్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొదటి రోజు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అనే రీతిలో చివరి వరకు పోరాడిన తీరు కనువిందు చేసింది.


వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్సీ


వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే

క్రీడలతోనే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించవచ్చు..

క్రీడలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముథోల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బాలుర విభాగంలో పదో జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... క్రీడలతో విద్యార్థులకు ప్రత్యేకంగా గుర్తింపు లభిస్తుందని వెల్లడించారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు క్రీడల్లో సైతం నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. గురుకులాలు క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడంలో ప్రముఖ విద్యా కేంద్రాలుగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. విద్యతోనై సమాజంలో మార్పు సాధ్యమనే విషయాన్ని మహనీయులు గుర్తించారని పేర్కొన్నారు. క్రీడాకారులు పోటీల్లో గెలుపొందడానికి సర్వశక్తులు ఒడ్డీ పోరాడాలన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని వెల్లడించారు. మొదటి రోజు పలు క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ టీ ఫ్లోరెన్స్ రాణి, జోనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సత్యనారా యణ, ప్రిన్సిపాల్ సి.నర్సింహా రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్, మండల విద్యాధికారి రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సాయిరాం, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఎంపీ టీసీ దేవోజి భూమేష్, నాయకులు తాటివార్ రమేష్, మోహన్, సప్పటోల్ల పోతన్న, ధర్మపురి శ్రీనివాస్, వివిధ పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

- వేంకటేశ్వర ఆలయంలో శివలింగానికి పంచామృతం


తలమడుగు వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఆలయంలోని స్వామి మూల విరాట్

తలమడుగు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. భక్తులు ఉదయం నాలుగు గంటలకే కార్తీక స్నానాలు ఆచరించి గ్రామాల్లో గల ఆలయాల్లో భాజాభజంత్రీలతో పూజలు నిర్వహిస్తున్నా రు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని శివలింగానికి పంచామృతం, పుష్పాభి షేకం నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఇంద్రాసేనారెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్, కోశాధి కారి రాంరెడ్డి, గౌరవ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, భూమన్న, శ్రీకాంత్, వెంకన్న, నారాయణరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 ; కనిష్ఠం 19.9



నిర్మల్
జిల్లా వార్తలు
8
మంగళవారం 12 నవంబరు 2024

కొనసాగుతున్న ఆయుత చండీయాగం



నిర్మల్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో శ్రీవైష్ణ ఆయుత చండీయాగం సోమవారం కొనసాగింది. కృష్ణ స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న యాగానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. పట్టణ కేంద్రంతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి యాగంలో పాల్గొంటున్నారు. పట్టణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

మహాదేవుని మందిరంలో

ఘనంగా దీపారాధన



భైంసా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెరువుకట్ట మహాదేవుని మందిరంలో సోమవారం సుభద్రవాటిక శిశు మందిర్ విద్యార్థులు దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

బకాయిలు చెల్లించకున్నా ఉపాధి అంచనా



- జిల్లాలో చేసిన పనుల బిల్లుల పెండింగ్
- కాంటాక్టర్ల విన్నపాలపై పట్టింపు కరువు
- పీఆర్‌లో కొత్త ఇంజనీర్లకు సీసీ రోడ్ల పనుల బాధ్యతలు
- నిధుల కొరత ఉన్నా ప్రతిపాదనల్లో బిజీ బిజీ
- అన్ని శాఖల్లో ఇదే తీరు

నిర్మల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ రాజ్ శాఖను బకాయిల భారం గత రెండు మూడేళ్ళ నుంచి అటు గుత్తేదారులను ఇటు కాంట్రాక్టర్‌లను వేధిస్తోంది. నిధుల కొరత కారణంగా గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి పంచాయతీరాజ్‌శాఖలో అభివృద్ధి పనులు చేపట్టిన గుత్తేదారులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. నిధుల కొరత కారణంగా పనులు చేసిన కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఇప్పటికే పలుసార్లు ఆందోళనలకు సైతం దిగారు. దాదాపు ఏడాదిన్నర కాలం నుంచి పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో ఈజీఎస్ కింద పేరుకుపోయిన రూ.35 కోట్ల బకాయిలను ఇప్పటి వరకు చెల్లించడం లేదు. దీంతో ఆ శాఖలోని ఈజీఎస్ పనులన్నీ ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. అలాగే చిన్న చితకపనులు చేసేందుకు సైతం గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఆ శాఖలో అయోమయ పరిస్థితులు కొనసాగుతున్న క్రమంలోనే కొత్తగా తొమ్మిది మంది ఏఈల నియామకం జరిగింది. వీరికి ప్రస్తుతం పంచాయతీరాజ్‌శాఖ అధికారులు మళ్లీ ఎన్ఆర్ ఈజీఎస్ కింద సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.50 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఉపాధి హామీ శాఖ ద్వారా శాఖల వారీగా పనుల కేటాయింపు జరుగుతున్నందున ఇందులో భాగంగానే పంచాయతీరాజ్‌శాఖకు కూడా ఈ పనుల బాధ్యతను అప్పగించారు. ప్రస్తుతం కొత్తగా నియమితులైన ఏఈలంతా నియోజకవర్గాల వారీగా ప్రతిపాదనల రూపకల్పనలో బిజీగా మారిపోయారు. నిర్మల్ నియోజకవర్గంలో రూ.20 కోట్లు, ముథోల్ నియోజకవర్గంలో రూ.20కోట్లతో పాటు ఖానాపూర్ నియోజకవర్గంలో రూ.10 కోట్లతో పనులకు సంబంధించిన అంచనాలను రూపొందిస్తున్నారు. గతంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన పనులకు సంబంధించి రూ.35 కోట్ల బకాయిలపై ఇప్పటికి స్పష్టత కనిపించడం లేదు. అయితే పనులు చేపట్టిన సర్పంచ్‌లు, కాంట్రాక్టర్‌లు బిల్లుల కోసం అప్పట్లో ఉద్యమాలు చేసి విసిగిపోయారు. అయితే కొత్త ప్రభుత్వమైన తమకు బిల్లులు చెల్లించాలని వారు కోరుతున్నారు. పాత బిల్లులు చెల్లించనట్లయితే కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఎలా చేపట్టాలంటూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు సైతం వాపోతున్నారు.

మొదటి నుంచి ఇదే తంతు

జిల్లావ్యాప్తంగా గత ఏడాదిన్నర క్రితం వరకు ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పనుల నిర్వహణ బాధ్యతలను పంచాయతీరాజ్‌శాఖకు అప్పగించడంతో అధికారులు ఆగమేఘాల మీద పనులు పూర్తి చేయించారు. అయితే పనులు పూర్తవ్వడంతో తమకు బిల్లులు చెల్లించాలంటూ అధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చారు. అప్పటికే మంజూరైన నిధుల విడుదల నిలిచిపోవడంతో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు బిల్లులు చేయలేకపోయారు. ఇలా దాదాపు రూ.35 కోట్లకు పైగా ఉపాధి హామీ పనులకు సంబంధించిన బిల్లుల బకాయిలున్నట్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతేనే బకాయిలను చెల్లించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు మాత్రం బిల్లుల బకాయిలపై ప్రభుత్వం స్పష్టతనివ్వకపోవడంతో పనులు పూర్తి చేసిన వారంతా ఆందోళనకు గురవుతున్నారు. అలాగే కొత్తగా ప్రతిపాదనల రూపకల్పనకు కూడా ప్రాధాన్యత దక్కే అవకాశాలు లేవంటున్నారు.



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన యువ ఇంజనీర్‌లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

రూ. 50కోట్లతో తాజాగా ప్రతిపాదనలు

ఉపాధిహామీ పథకం కింద ఈ సారి నిర్మల్ జిల్లావ్యాప్తంగా సీసీరోడ్ల నిర్మాణం కోసం రూ.50కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇటీవల విధుల్లో చేరిన కొత్త ఏఈలతో పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సీసీ రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలను రూపొందింపజేస్తున్నారు. ఇప్పటికే ఈ అంచనాల తయారీ ప్రక్రియ కొనసాగుతోందని అంటున్నారు. మరో వారం పదిరోజుల్లో మొత్తం అంచనాలన్నీ సిద్ధమవుతాయని ఆ తరువాత పనుల ఆమోదంతో పాటు నిధుల మంజూరుకు ఉపాధి హామీ శాఖకు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు నివేదించనున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి ఆమోదం లభించగానే పనులు మొదలుపెట్టాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే దాదాపు రూ.35 కోట్ల బకాయిలున్న కారణంగా కొత్తగా రూ. 50 కోట్ల నిధుల విడుదల విషయమై సందేహాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు. ప్రభుత్వం మొదట పాత బకాయిల నిధులను విడుదల చేసిన తరువాతనే కొత్త పనులు చేపట్టేందుకు ఎవరైనా ముందుకు వచ్చే అవకాశాలుంటాయని అంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరయ్యను సంప్రదించగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇప్పటి వరకు రూ. 50 కోట్లు అందినట్లు తెలిపారు. ప్రస్తుతం అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది చేపటట్టిన పనులకు సంబంధించి రూ. 35 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన వివరించారు.

- శంకరయ్య, పంచాయతీ రాజ్ ఈఈ, నిర్మల్

సీసీఐ నిబంధనలను వ్యతిరేకిస్తూ

పత్తి కొనుగోళ్ల నిలిపివేత

- కాటన్ జిన్నింగ్ మిల్లు యాజమానుల తీరుపై రైతుల ఆందోళన
- జాతీయ రహదారిపై రాస్తారోకో
- మార్కెటింగ్ అధికారుల నిలదీత
- ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావ్ పాటిల్ తో వాగ్వాదం



భైంసాలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న పత్తి రైతులు

భైంసా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన నిబంధనలను వ్యతిరేకిస్తూ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఇండస్ట్రీస్ యాజమానులు సోమవారం పత్తి కొనుగోళ్లను నిలిపివేసారు. తెలంగాణ కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు భైంసా కాటన్ వ్యాపారులు సీసీఐ, ప్రైవేట్ మిల్లులలో పత్తి కొనుగోళ్లను నిలిపివేసి సమ్మె బాట పట్టారు. కాటన్ మిల్లు యాజమానుల సమ్మెకు సంబంధించి ఎలాంటి ముందస్తు సమాచారం లేకపోవడంతో భైంసాకు వందలాది మంది రైతులు తమ పత్తి దిగుబడులను విక్రయించేందుకు గాను తీసుకవచ్చారు. అయితే సీసీఐ కొనుగోలు కేంద్రాలతో పాటు ప్రైవేట్ మిల్లులలో సైతం కొనుగోలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ పత్తి రైతులు ఆందోళనలు చేపట్టారు. భైంసా - నిర్మల్ జాతీయ రహదారిలోని మహాగాం క్రాస్ రోడ్డు వద్ద రోడ్డుపై భైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వాహనాల రాకపోకలను అడ్డుకొని ట్రాఫిక్ వ్యవస్థను పూర్తిగా స్తంభింప చేసారు. ప్రభుత్వానికి, మార్కెటింగ్ అధికారులకు, కాటన్ మిల్లు యాజమానులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేపట్టారు. వేలాది రూపాయలు వెచ్చించి అద్దె వాహనాల్లో దిగుబడులను విక్రయించడానికి తీసుకవచ్చిన నేపథ్యంలో తమ దిగుబడులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలను కొనసాగించారు. పత్తి రైతుల ఆందోళనల సమాచారం అందుకున్న భైంసా రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ ఘటన స్థలికి చేరుకొని వారిని సముదాయించేందుకు విఫలయత్నం చేశారు. ఇదే సమయంలో మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆందోళన స్థలికి చేరుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకో విరమించాలని సూచించారు. దీంతో రైతులు ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్‌పై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ నిలదీసారు. కొనుగోళ్ల ప్రారంభింప చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. కాగా రాష్ట్ర స్థాయిలో కొనుగోళ్లపై కాటన్ మిల్లు యాజమానులతో ప్రభుత్వాధికారులు, సీసీఐ అధికారులు చర్చలు జరుగుతున్నాయని, మధ్యాహ్నం వేళ వరకు కొనుగోళ్ల ప్రారంభమవుతాయని మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్ రైతులకు తెలియచెప్పి శాంతపరిచారు. అప్పటి వరకు ఆందోళనలను విరమించి పత్తి దిగుబడులను తీసుకవచ్చిన వాహనాలను సీసీఐ కొనుగోలు కేంద్రం కొనసాగుతున్న శ్రేయస్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో తరలించాలని సూచించారు. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రంలోకి వెళ్లిన సమయంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ అక్కడి చేరుకున్నాడు, దీంతో రైతులు తక్షణమే పత్తి కొనుగోళ్ల చేపట్టేలా చర్యలు తీసుకోవాలంటూ మార్కెట్ కమిటీ చైర్మెన్‌తో వాగ్వాదానికి దిగారు. రైతు ప్రభుత్వంలో తమకు ఎంతటి కష్టనష్టాలు వచ్చాయంటూ రైతులు నినాదాలు చేశారు. అప్పటికే భైంసా మార్కెట్ కమిటీ కార్యదర్శి పూర్య నాయక్, అసిస్టెంట్ కార్యదర్శి శ్రీనివాస్‌లు సీసీఐ కొనుగోలు కేంద్రం కొనసాగుతున్న శ్రేయస్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ప్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడి కొనుగోళ్ల ప్రారంభించేందుకు గాను అవసరమైన చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వేళలో హైదరాబాద్‌లో కాటన్ మిల్లు యాజమానులు , సీసీఐ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. దీంతో మధ్యాహ్నం 1 గంట నుంచి భైంసాలో సీసీఐ, ప్రైవేట్ కాటన్ మిల్లులలో పత్తి కొనుగోళ్ల పునః ప్రారంభమయ్యాయి.



భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పాటిల్‌తో రైతుల వాగ్వాదం

సంక్షిప్త సమాచారం

తూనికలు,కొలతల

శాఖాధికారుల తనిఖీలు



కాంటాలకు సీల్ వేయిస్తున్న తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారి భూలక్ష్మీ

భైంసా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో సోమవారం తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారిణి భూలక్ష్మీ నేతృత్వంలో బృందం తనిఖీలు చేపట్టింది. స్థానిక గాంధీ గంజ్‌లోని కమీషన్ ఏజెంట్ల వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించింది. ఆయా వ్యాపార సంస్థల్లోని కాంటాలను పరిశీలించింది. స్టాంపింగ్ , సీలింగ్ లేని కాంటాలను గుర్తించి అక్కడికక్కడే వాటికి స్టాంపింగ్, సీలింగ్ వేసే చర్యలను పూర్తి చేయించింది. ఈ సందర్భంగా జిల్లా అధికారిణి భూలక్ష్మీ మాట్లాడుతూ . వ్యాపార సంస్థల నిర్వాహకులు కాంటాలకు తప్పనిసరిగా స్టాంపింగ్, సీలింగ్ ప్రక్రియలు నిర్వహించుకొని ప్రభుత్వ నియమ, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించింది. నిబంధనలకు అనుగుణంగా లేని కాంటాలను సీజ్ చేసి సంబంధిత వ్యాపార సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

సమస్యను పరిష్కరించాలని పొర్లుదండాలు



పొర్లుదండాలు పెడుతున్న బాధితులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం సమస్య పరిష్కరించాలని కోరుతూ చందుల సాయికిరణ్ అనే వ్యక్తి పొర్లుదండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు తనకు ఆస్తిలో వాటా ఇవ్వకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

పత్తి కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్‌తో కలిసి ఆమె వ్యవసాయ మార్కెటింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంటను అమ్మిన వెంటనే నిర్దేశించిన సమయంలోపు రైతుల ఖాతాలలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి తేమ శాతంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించి అధికలాభాలు పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోజువారీగా సేకరించిన పత్తికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పత్తి పంటను విక్రయించడానికి వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మార్కెట్ యార్డ్‌లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ కార్యదర్శులు ఆజాం అలీ, దుండా నాయక్, పుడ్యా నాయక్, గంగన్న, చంద్రశేఖర్ నాయక్, వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరుపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో భాగంగా ఇళ్ల జాబితా ప్రక్రియ పూర్తయినందున కుటుంబ సభ్యుల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేవించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్మిత నమూనాలు స్పష్టంగా నమోదు చేయాలని, సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలన్నారు. ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో సర్వేను పరిశీలించాలని సూచించారుజ సర్వేలో భాగంగా ప్రజల నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల తదితర నిర్దేశిత వివరాలను సేకరించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సర్వేను పూర్తి చేసిన ఇళ్లకు సంబంధించి వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 2,31,286 కుటుంబాలకు గాను 33,590 కుటుంబాల సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు అందజేయాలన్నారు. ఎన్యుమరేటర్లు సమయానికి తమకు కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌లోకి చేరుకొని సర్వే నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఎన్యుమరేటర్లు నిర్వహించిన సర్వేలోని 20 శాతం వివరాలను ర్యాండంగా పరిశీలించాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో సీడీపీవో జీవరత్నం, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డిలు, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌ఘాట్ వద్ద పెద్దపులి సంచారం



సారంగాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మహబూబ్ ఘాట్ వద్ద ఆదివారం రాత్రి నిర్మల్, ఆదిలాబాద్ రోడ్డుపై పెద్దపులి నడుచుకుంటూ వెళ్లే సమయంలో వాహనదారులకు కనిపించడంతో వాహనదారులు అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. వెంటనే అటవీశాఖ అధికారి నజీర్‌ఖాన్ సిబ్బందితో మహబూబ్ ఘాట్ వద్దకు వెళ్లి పులి సంచరిస్తున్న రహదారి వద్ద గాలింపు చర్యలు చేపట్టి వాహనదారులను అప్రమత్తంగా చేశారు. దీంతో పాటు సహ్యాద్రి చుట్టుపక్కల ఉన్నటువంటి గ్రామస్థులకు అటవీశాఖ అధికారులు పెద్దపులి సంచారంపై అవగాహన కల్పించి గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ మార్గం గుండా రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. దీంతో పాటు సహ్యాద్రి కొండల్లో సంచరిస్తున్న పెద్దపులి కోసం హైదరాబాద్ నుంచి వచ్చిన బృందం గాలింపు చర్యలు చేపట్టి పెద్దపులి సంచరిస్తున్న ప్రాంతాన్ని గుర్తించారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్



బోకర్ బీజేపీ ప్రచారసభలో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే

భైంసా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరుగనున్న మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ తరలివెళ్లారు. సోమవారం బోకర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బీజేపీ పార్టీ బహిరంగసభలో పాల్గొన్నారు. బోకర్ నియోజక వర్గ బీజేపీ అభ్యర్థి జయచౌహాన్, నాందేడ్ పార్లమెంట్ అభ్యర్థి డా.సంతుక్‌కు మద్దతుగా ప్రచారాన్ని చేపట్టారు. బహిరంగసభ ముగిసిన అనంతరం బోకర్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సుడిగాలి పర్యటనలు చేపట్టి అభివృద్ధి, సంక్షేమం కాంక్షించి బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ విస్తృత ప్రచారం నిర్వహించారు.

ముథోల్ అభివృద్ధికి ముందుకు రండి

ముథోల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఇరిగేషన్, అభివృద్ధిలో ఆయా పార్టీల నాయకులు ముందుకు వచ్చి భాగస్వామ్యం కావాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్ అన్నారు. నియోజకవర్గం కేంద్రమైన ముథోల్‌లో సోమవారం మహాత్మా జ్యోతిబాపూలే బాలికల జూనియర్ కళాశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్య, వైద్యం, ఇరిగేషన్ అభివృద్ధిలో రాజకీయాలకు చోటుండొద్దని ఆయన హితవు పలికారు. ఎన్నికల అప్పుడే రాజకీయాలు చేయాలని సూచించారు. ముథోల్ అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. త్వరలో ముథోల్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు కానున్నట్లు ఆయన చెప్పారు. ముథోల్‌లో త్వరలో మహిళా డిగ్రీ కళాశాల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమృత, మండల బీజేపీ అధ్యక్షుడు కోరిపోతన్న, మున్నూరు కాపుసంఘం తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేష్, నాయకులు నర్సాగౌడ్, తాటివార్ రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.